క్లుప్తంగా

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ వితరణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మాధవి, చిత్రంలో న్యాయవాది ప్రతాప్‌రెడ్డి

బత్తలపల్లి: మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలకు సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను వితరణగా అందజేశారు. సీసీఎల్ ప్రాడక్ట్స్ కంపెనీ(హైదరాబాద్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద రూ.1.70 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సాహితీ గగన్ మహల్ అధ్యక్షుడు, న్యాయవాది జె.ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గతేడాది(2024–25) పని చేసిన కాంట్రాక్టు అధ్యాపకుల నుంచి 2025–26 విద్యాసంవత్సరానికి రెన్యూవల్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈమేరకు ఐడీ కళాశాలైన కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ డా. స్మిత శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్ట్ అధ్యాపకులందరూ ఈ నెల 19 లోపు వారు పని చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్ఎస్‌సీ ధ్రువీకరణ పత్రం, అదనపు అర్హతలు, 2024–24 విద్యా సంవత్సరం రిజల్ట్ అనాలసిస్ జత చేయాలని సూచించారు.

బదిలీ కానిస్టేబుళ్లకు సన్మానం



కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న దృశ్యం

తాడిమర్రి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన కానిస్టేబుళ్లు శ్రీకాంత్, మన్సూర్ ఇలాహిని శుక్రవారం ఎస్ఐ కృష్ణవేణి, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎస్ఐ కానిస్టేబుళ్ల సేవలను కొనియాడారు.

క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన



మాట్లాడుతున్న ఆర్డీటీ వైద్యురాలు జ్యోతి

బత్తలపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆర్డీటీ సహకారంతో మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన నిర్వహించారు. వైద్యాధికారులు గోవర్ధన్ నాయుడు, అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాదాపు 30 మంది మహిళలకు ఉచిత సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు చేపట్టారు. క్యాన్సర్ ముందస్తు నివారణకు అవసరమైన హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. ఆర్డీటీ వైద్యులు జ్యోతి, సుప్రజ, శిరీష సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి



బుక్కపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పుట్టపర్తి: ప్రజలు తమ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ రామ్మోహన్ చౌదరి సూచించారు. జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా శుక్రవారం ఆయన బుక్కపట్నంలో సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి దోమల నిర్మూలనపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న చోట లార్వాను నివారించే అబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. అంతకు ముందు వారు డెంగీపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మురళి, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



నిమ్మకాయల అలంకరణలో పెద్దమ్మతల్లి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాలే వీధి పెద్దమ్మ తల్లికి ఆషాఢమాసం శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటేశ్శర్మ ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష మంగళ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు.

దారికి అడ్డంగా మట్టి



సిమెంటు రోడ్డుపై మట్టి తోలించిన దృశ్యం

కదిరి అర్బన్: మండలంలోని మొటుకుపల్లి గ్రామంలో దారికి అడ్డంగా మట్టి వేయడంతో ప్రజలు రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటి ముందు మట్టి తోలుకున్నాడు. ఈక్రమంలో సిమెంట్ రోడ్డుపై మట్టి ఎత్తు వేయడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఎడ్లబండ్ల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. సమస్యను ఎంపీడీఓ పోలప్ప దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామస్తుడు రాంప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. అధికారులు స్పందించి మట్టిని తొలగించాలని కోరుతున్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా?



ప్యాదిండి వాల్మీకి విగ్రహం సమీపంలో నిలిచిన నీరు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ప్యాదిండి గ్రామంలో ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి నీరు నిలిచి అపరిశుభ్రత నెలకొంది. ప్యాదిండి నుంచి ధర్మవరం వెళ్లే దారిలో స్థానిక వాల్మీకి విగ్రహం సమీపంలో నీరు నిలవడంతో దుర్వాసన వస్తోంది. దోమలు పెరగడంతో జ్వరాలు సోకే అవకాశం లేకపోలేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని దోమలు వృద్ధి చెందకుండా పారిశుధ్య పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రస్థాయి రైతు సదస్సు విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న జంగాలపల్లి పెద్దన్న తదితరులు

బత్తలపల్లి: సోలార్, గ్రీన్ ఎనర్జీ పేరుతో వ్యవసాయ భూములను ప్రైవేట్, కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 20న నంద్యాలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మారుతి, భాగ్య, లక్ష్మన్న, రైతు సోదరులు రాజగోపాల్, చెన్నయ్య, మాధవరెడ్డి, వెంకటేశులు, ఆదినారాయణతో కలిసి ఆయన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో రైతుల భూములను సోలార్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ పేరుతో ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు ధారదత్తం చేస్తోందన్నారు. ప్రభుత్వం రైతులతో ఎలాంటి అనుమతి తీసుకోకుండానే నిర్ణయాలు తీసుకుందన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత అని రైల్వేస్టేషన్ మేనేజర్ చల్లా నరసింహనాయుడు తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో శుక్రవారం జస్ట్ రైట్స్ సంస్థ సహకారంతో సమత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్టేషన్ మేనేజర్ అధ్యక్షతన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రైల్వే ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్‌తోపాటు ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ఎస్ఐ కోటేశ్వరరావు, జీఆర్‌పీ ఎస్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, సమత స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసులునాయుడు, వెంకటేశ్వర్లు, బాలల పరిరక్షణ విభాగం మురళీధర్ మాట్లాడారు. భిక్షాటన, వెట్టి చాకిరీ, వ్యభిచార వృత్తిలో దించడానికి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఉపయోగించుకోవడానికి మానవ అక్రమ రవాణా చేస్తారని వివరించారు. ఎవరికైనా సినిమా అవకాశాలు, ప్రేమ పేరుతో మోసగించి వారిని ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లే ఆలోచన ఉన్నట్లయితే చైల్డ్‌లైన్ 1098కు, డయల్ 100కు తెలియజేయాలని సూచించారు. రైలులో మహిళలు, పిల్లలు అక్రమ రవాణా చేయకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రయాణికులపైన ఉందని తెలిపారు. సమత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మనోహర్‌నాయుడు, ఉమాశంకర్‌రెడ్డి, బాబ్‌జాన్, రైల్వే ప్రయాణికులు పాల్గొన్నారు.

‘చలో విద్యుత్ సౌధ’కు తరలిరండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు

పుట్టపర్తి టౌన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ఈనెల 21న తలపెట్టిన చలో విద్యుత్ సౌధ కార్యక్రమానికి తరలిరావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్‌చేయాలని, జేఎల్ఎం గ్రేడ్‌–2, ఎనర్జీ అసిస్టెంట్లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని కోరారు. 2022 పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రమణ, జిల్లా అధ్యక్షులు షానావాజ్, జిల్లా కోశాధికారి దస్తగిరి, నరేష్, శ్రీకాంత్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన అవసరం



పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: ఫ్లోరోసిస్ వ్యాధిపై వైద్య సిబ్బంది అవగాహన పెంచుకుని ప్రజలకు తెలియజేయాలని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్లు ఆంజనేయులు, శశికళ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లిన సమయంలో మల్టీ విటమిన్ మాత్రలు తీసుకెళ్లాలని సూచించారు. ఆహారపు అలవాట్లను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. వాటర్ శాంపిల్స్ సేకరించి అవసరమైన వారికి పునరావాస పరికరాలను పంపిణీ చేయాలన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫ్లోరోసిస్ బాధితులకు చేతికర్రలు, వాకర్స్, నడుము, మెడ బెల్టులు అందజేశామన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

ఓడీచెరువు: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ఆర్డీటీ చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ సేవలు తిరిగి కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాత్రికేయులు షాజహాన్, భుజంగరావు, రంగప్ప, ఫిరోజ్, ఆంజనేయులు, మహబూబ్‌బాషా, బాబా, ఫయాజ్, మౌలా, ఆనంద్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

పుట్టపర్తి టౌన్: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, డాక్టర్ నాగ దుర్గాదేవి, సీహెచ్ఓ శివరాంతో ఆమె కలసి బీసీ, ఎస్టీ హాస్టళ్లను తనిఖీ చేశారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందిస్తున్న భోజనంతోపాటు వసతులను పరిశీలించారు. వార్డెన్లకు పలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి భోజనం రుచి చూశారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన

ముదిగుబ్బ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఫ్లోరోసిస్ వ్యాధిపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా ఫ్లోరోసిస్ అధికారులు ఆంజనేయులు, కిశోర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఉమ్మడి జిల్లాలో ఫ్లోరోసిస్ బాధితులకు చేతి కర్రలు, వాకర్స్, నడుము, మెడ బెల్టులు అందజేశామన్నారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ శ్వేత, డాక్టర్ రాజేంద్ర, సీహెచ్ఓ సరస్వతి, హెల్త్ సూపర్ వైజర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలు రామాపురం, బత్తలపల్లి జట్లు



విజేతలుగా నిలిచిన జట్లతో ఆర్డీటీ సిబ్బంది, కోచ్‌లు

బత్తలపల్లి: ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ విజేతలుగా రామాపురం ఉన్నత పాఠశాల(బాలికలు), బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాల(బాలురు) జట్లు విజేతలుగా నిలిచాయి. మూడు రోజులుగా బత్తలపల్లి ఆర్డీటి క్రీడా మైదానంలో ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. బాలికల విభాగంలో మాల్యవంతం, రామాపురం ఉన్నత పాఠశాలలు, బాలుర విభాగంలో మాల్యవంతం, బత్తలపల్లి ఉన్నత పాఠశాలలు ఫైనల్‌కు అర్హత సాధించాయి. శుక్రవారం ఫైనల్ పోటీలను నిర్వహించగా తొలుత బ్యాటింగ్ చేసిన రామాపురం జట్టు పది ఓవర్లుకు 83 పరుగులు చేసింది. అనంతరం మాల్యవంతం జట్టు 72 పరుగులకే కుప్పకూలింది. బాలుర విభాగంలో తొలుత బ్యాటింగ్ చేసిన బత్తలపల్లి జట్టు 12 ఓవర్లకు 88 పరుగులు చేసింది. అనంతరం మాల్యవంతం జట్టు 12 ఓవర్లుకు 59 పరుగులకే చతికిలపడింది. బాలికలలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రసూన, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ చరిత, బాలుర విభాగంలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మహేంద్ర, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ భరత్ దక్కింది. విజేతలకు ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ చేతులు మీదుగా అందజేశారు. ఆర్డీ హనుమంతప్ప, సిబ్బంది శోభారాణి, కావేరి, కేశవరెడ్డి, రమణ, పీడీలు లక్ష్మీనారాయణ, నాగరాజు, లాల్‌బాషా, జగదీష్, సీనియర్ ప్లేయర్స్ శంకర్ ధావన్, బాబ్‌జాన్, ఎస్ఐ ప్రవీణ్, ఆర్డీటి కోచ్ జయరాం, ఫుట్‌బాల్ కోచ్ దుర్గాప్రసాద్, కబడ్డీ కోచ్ రామయ్య, రామాపురం కేశవనాయుడు, అప్పస్వామి పాల్గొన్నారు.

యాప్‌ల నిర్వహణలో అలసత్వం వద్దు



సీడీపీఓ సరస్వతికి అర్జీ అందజేస్తున్న మృతి చెందిన వాసంతి కుమార్తె

బత్తలపల్లి: యాప్‌ల నిర్వహణలో అలసత్వం వహించవద్దని సీడీపీఓ సరస్వతి అంగన్‌వాడీ వర్కర్లకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ప్రాజెక్టు మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్, ఆధార్, ఫుడ్ రిసీవ్స్, పోషణ ట్రాకర్ యాప్‌లపై వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ యూనిఫాంలోనే ఉండాలని ఆదేశించారు. ప్రతి సెంటర్ ప్రిస్కూల్ యాక్టివిటీస్ చేయాలని తెలియజేశారు. అనంతరం ఇటీవల ప్రాజెక్టు కార్యదర్శి, యర్రాయపల్లి అంగన్‌వాడీ వర్కర్ వాసంతి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా, ఆమె మృతికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. వాసంతి మృతితో ఖాళీ అయిన అంగన్‌వాడీ పోస్టును తన కూతురికి ఇవ్వాలని మృతురాలి భర్త నారాయణస్వామి సీడీపీఓ సరస్వతికి అర్జీ అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చంద్రమ్మ, ఎర్రమ్మ, బ్లాక్ కోఆర్డినేటర్ ఓబులమ్మ, మూడు మండలాల అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన



మున్సిపల్ కార్యాలయం ముందు ఒంటికాలిపై నిరసన తెలియజేస్తున్న కార్మికులు

పుట్టపర్తి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధిరాంలోకి వచ్చి ఏడాదైనా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. రాష్ట్ర సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు జీఓలు జారీ చేయకపోవడం, అప్కాస్ సంస్థను రద్దు చేసి ప్రైవేటు సంస్థలకు అప్పగించడం సరికాదని మండిపడ్డారు. ఉద్యోగ విరమణ వయస్సు 62కు పెంచాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగార్జున, అధ్యక్షులు నరసింహులు, కోశాధికారి గోవిందు, సహాయ కార్యదర్శి పెద్దన్న, రామయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ధర్మవరం: మున్సిపల్ దినసరి పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం నుంచి సమ్మె చేయనున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయుబ్‌ఖాన్, వాటర్ వర్క్స్ జిల్లా అధ్యక్షుడు నరేష్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.బాబు, కార్యదర్శి లక్ష్మీ ఓబులేసు, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షులు బొగ్గు నాగరాజు, జయ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన దీక్షకు వారు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదిన్నర నుంచి కనీస వేతనం అమలు చేయాలని పలుమార్లు అధికారులు అధికార పార్టీ నాయకులకు వినతిపత్రాలు అందించినా పట్టించుకోవండ లేదన్నారు. కార్మిక సంఘం నాయకులు అనిల్, వెంకటరాముడు, ప్రసాద్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



గురుప్రసాద్(ఫైల్)

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ తన కుటుంబంతో కలిసి బెంగుళూరులో నివాసం ఉంటున్నారు. గ్రామంలో మొహర్రం సందర్భంగా స్వగ్రామానికి ఆదినారాయణ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. ఈ నెల 6న ఆదినారాయణ కుమారుడు గురుప్రసాద్(25) పనిమీద కట్టకిందపల్లికి బైక్‌పై వెళ్లి డి.చెర్లోపల్లికి తిరిగి బయలుదేరాడు. ఈక్రమంలో వేగాన్ని అదుపు చేయలేకి అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి, అనంతపురం ఆస్పత్రులకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామగిరి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సానుభూతిపరుల వాహనాలు, ఇళ్లపై దాడులు జరుగుతున్నాయి. ప్రశ్నిస్తే దాడి చేసి, కేసులు పెడతారా సునీతమ్మా అని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కన్వీనర్ మీనుగ నాగరాజు, యూత్ కన్వీనర్ మణికంఠ, జేసీఎస్ కన్వీనర్ వెంకటరెడ్డి విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సర కాలంగా రామగిరి మండలం రావణకాష్టంగా మారిందన్నారు. ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాగా భద్రతా వైఫల్యంతో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు వంద మందిపై కేసులు పెట్టింది మీరు కాదా అన్నారు. రామగిరి ఎంపీపీపై కన్నేసి మూడు సార్లు వాయిదా పడేందుకు టీడీపీ నాయకులే కారణమన్నారు. పార్టీలకతీతంగా న్యాయం చేసేందుకు ప్రజలు అధికారం ఇచ్చారన్నారు. ఇప్పటికైనా ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు.

డి.చెర్లోపల్లిలో పారిశుధ్య పనులు

బత్తలపల్లి: డి.చెర్లోపల్లిలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి ఆధ్వర్యంలో కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో విష జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో రెండు రోజులుగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడం వల్ల దోమలు ఉత్పత్తి పెరిగి విషజ్వరాలు ప్రబలుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరించడంతో పంచాయతీ కార్యదర్శి కార్మికులతో కాలువలను శుభ్రం చేయించారు. లార్వా నియంత్రణ భాగంగా కాలువల్లో అబేట్ మందును పిచికారీ చేయించారు. అంతకు ముందు బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. హెల్త్ సూపర్‌వైజర్ అశ్వర్థనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు డేవిడ్, గంగాదేవి, హెల్త్ ప్రొవైడర్ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, మహిళా పోలీసు గురుదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారు చేయాలి



ముక్తాపురంలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు

కనగానపల్లి: గ్రామాల్లో విరివిగా పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రతను కాపాడాలని పంచాయతీరాజ్ సిబ్బందిని ఆర్‌పీఓ జనార్దన్ ఆదేశించారు. మండలంలోని ముక్తాపురం గ్రామంలో శుక్రవారం ఆయన డీఎల్‌పీఓ శివకుమారితో కలసి పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రామంలో క్రమం తప్పకుండా రోజు చెత్తను సేకరించి ఒకచోట డంపింగ్ చేసి వర్మీ కంపోస్టు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్‌కుమార్, పంచాయతీ కారదర్శి సుధాకర్ రెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను శుక్రవారం ఆర్డీఓ మహేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్‌లో పరిసరాల పరిశుభ్రత, ప్రయాణికుల నిరీక్షణ గదుల స్థితి, తాగునీటి సదుపాయాలు, సైన్‌బోర్డులు, వెలుతురు, భద్రతా ఏర్పాట్లు, చంటిబిడ్డలకు పాలు ఇచ్చు గది, పార్శిల్ కార్యాలయం, టికెట్ కౌంటర్, మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ డీఎం సత్యనారాయణతో మాట్లాడారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, బస్సుల సకాలంలో రాకపోకలు, టైమ్ టేబుల్ ప్రదర్శనపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రయాణికులకు భద్రతతోపాటు నమ్మకాన్ని కలిగించాలని సూచించారు.

శివపార్వతులకు పూజలు



ముదిగుబ్బ: మండల కేంద్రంలోని శివ పంచనామ ఆలయంలో శుక్రవారం గాండ్ల సంఘం ఆధ్వర్యంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ పార్వతులను కూరగాయలతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

ముదిగుబ్బ: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ శివరాముడు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఐ శివరాముడు ఆధ్వర్యంలో బాలికల విద్య, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. ఆపద సమయంలో డయల్ 100ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.